సీఎం సహాయనిధి ఎల్‌ఓసీ అందజేత



సీఎం సహాయనిధి ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

అడ్డగుట్ట: పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మారేడ్‌పల్లికి చెందిన రాజమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబసభ్యులు ఎమ్మెల్యే గణేష్‌ను కలిసి సీఎంఆర్‌ఎఫ్ మంజూరు చేయాలని కోరారు. ఇందుకు సంబంధించి మంజూరైన రూ. లక్ష ఎల్‌ఓసీని తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో బాధిత కుటుంబానికి అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి



బౌద్ధనగర్‌లో పర్యటిస్తున్న బీసీ రాజ్యాధికార సమితి నాయకులు

బౌద్ధనగర్: నగరంలోని పలు బస్తీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ డిమాండ్ చేశారు. బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో బస్తీ బాట కార్యక్రమం గురువారం బౌద్ధనగర్ డివిజన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా దాసు సురేష్ మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, నాయకులు ఘోరంగా విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి నాయకులు బండారు పద్మావతి, రాధిక, భాగ్యలక్ష్మి, దుర్గేష్, సాయికృష్ణ పాల్గొన్నారు.

'లెప్రసీ'పై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న గాంధీ వైద్యులు

గాంధీ ఆస్పత్రి: ప్రపంచ లెప్రసీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ వైద్యులు గురువారం ఆస్పత్రి ప్రాంగణంలో చైతన్యర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, డీవీఎల్ హెచ్‌ఓడీ సుధారాణిలు మాట్లాడుతు కుష్టువ్యాధి సాధారణ చర్మ వ్యాధి మాత్రమేనని, ప్రాథమిక దశలో గుర్తించి సరైన వైద్యం అందిస్తే నియంత్రణ సాధ్యమేనన్నారు. కుష్టువ్యాధిపై అపోహలు విడనాడాలని సూచించారు. కార్యక్రమంలో గాంధీ డీవీఎల్ హెచ్‌ఓడీ సుధారాణి, అసోసియేట్ ప్రొఫెసర్లు రఘుకిరణ్, గోపినాథ్ పాల్గొన్నారు.

హక్కులను ఉపయోగించుకోవాలి



డిప్యూటీ తహసీల్దార్ మాధవిని సత్కరిస్తున్న మహిళలు

అమీర్‌పేట : రాజ్యాంగ బద్ధంగా వచ్చిన హక్కులను ఉపయోగించుకోవాలని అమీర్‌పేట డిప్యూటీ తహసీల్దార్ మాధవి తెలిపారు. సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో భాగంగా గురువారం అమీర్‌పేట డివిజన్ సోనాబాయమ్మ బస్తీలో హక్కులపై అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండి ప్రజల కోసం కల్పించిన హక్కులను కాపాడాల్సిన అవసరముందని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జి.సత్యనారాయణ,శ్రీనివాస్‌రావు, రాజేశ్వరీ, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

సేవా సంఘ్ ఆవిర్భావ దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆలిండియా సేవా సంఘ్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన జెండాను సేవా సంఘ్ నాయకులు రవీంద్ర నాయక్ ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో సురేష్‌నాయక్, నాగనాయక్, భాస్కర్ నాయక్, వినోద్‌నాయక్, ఓయూ జేఏసీ నాయకులు మందాల భాస్కర్, సునీల్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం

మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు,అధికారులు నివాళులర్పించారు. గురువారం పలు ప్రాంతాల్లోని గాంధీ విగ్రహాల వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకుని దేశ స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని నాయకులు కోరారు.



ఎంజీ రోడ్డులో కాంగ్రెస్ నాయకురాలు కోట నీలిమా



బౌద్ధనగర్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ కంది శైలజ



చిలకలగూడలో కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్నలక్ష్మి



గాంధీ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, ఆర్ఎంఓ-1 శేషాద్రి

అమరవీరులకు టీజీపీసీబీ ఉద్యోగుల నివాళి



సనత్‌నగర్: దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) కార్యాలయ అధికారులు, ఉద్యోగులు గురువారం నివాళులు అర్పించారు. అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సభ్య కార్యదర్శి రవి, టీజీపీసీబీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్.

సనత్‌నగర్: ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని, సకాలంలో వైద్యం అందించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో బేగంపేట, అమీర్‌పేట డివిజన్లకు చెందిన 13 మంది లబ్ధిదారులకు రూ.3.93 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం అందించే విషయంలో జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, సంతోష్‌కుమార్, కిషోర్, కరుణాకర్‌రెడ్డి, కూతురు నర్సింహ్మా పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

దాడులకు వ్యతిరేకంగా పోరాటం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

లాలాపేట: చర్చిలు, క్రైస్తవులపై దాడులు పెరిగిపోతున్నాయని, వాటికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్(ఎన్‌సీసీ) జాతీయ అధ్యక్షులు రెవరెండ్ బిషప్ శ్యామ్‌పాల్, స్టీవెన్ చిట్టిబాబు, తెలంగాణ రాష్ట్ర నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్(ఎన్‌సీసీ) అధ్యక్షులు బిషప్ సంజయ్ ఆనంద్ అన్నారు. బుధవారం తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో ఎన్‌సీసీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఆర్‌పిఐ జాతీయ అధ్యక్షుడు, రిటైర్డ్ డీజీపీ బాబురావు మాట్లాడుతూ.. క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి ఎన్‌సీసీ కృషి చేస్తుందన్నారు. మిషనరీ ఆస్తుల పరిరక్షణకు పాటుపడతామన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

రసూల్‌పురా: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని టీజీఎస్‌ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ జీఆర్. కిరణ్ అన్నారు. సికింద్రాబాద్ డీవీ కాలనీ సేయింట్ మార్క్స్ ప్రోగ్రెసివ్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు గురువారం జింఖానా మైదానంలో ఘనంగా జరిగాయి. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, క్రీడల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ జేమ్స్ ప్రఫుల్లాకుమార్‌తో కలసి కిరణ్ బహుమతులు ప్రధానం చేశారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ పార్టీ

రసూల్‌పురా: 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెడుతోందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ సంస్థ మాజీ చైర్మన్ క్రిషాంక్ విమర్శించారు. తిరుమలగిరి చిన్నమ్మ తోటలో గురువారం కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా క్రిషాంక్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీఎస్టీ, రైతు, యువ డిక్లరేషన్ అమలు చేయాలని, ఆడబిడ్డలకు నెలకు రూ.2500, రైతు భరోసా రూ.15వేలు, తులం బంగారం హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే రాష్ట్ర ప్రజలు మార్పు చూస్తారని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను పూర్తిగా విస్మరిస్తూ పూటకో అమలు కాని పథకాలు ప్రారంభిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు ప్యారసాని శ్యాంకుమార్, వార్డు ఉపాధ్యక్షులు యశ్వంత్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా కంటోన్మెంట్, బాలంరాయి, చంద్రపురం కాలనీ, భూపతిరావునగర్ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మురళీకృష్ణ తెలిపారు. బాలంరాయి 11 కేవీ ఫీడర్ పరిధిలోని బాలంరాయి, హ్యాపీ ఎన్‌క్లేవ్, పైగా కాలనీ, విమాననగర్, మార్గదర్శి కాలనీ, లక్ష్మి గుంటి కాలనీ, 40 క్వార్టర్స్, కంటోన్మెంట్ వాటర్‌వర్క్స్ బాలంరాయి పరిసర ప్రాంతాలు, అల్వాల్ చంద్రపురం కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలోని చంద్రపురం కాలనీ, మంగాపురం, రైల్వే ట్రాక్, పంప్ హౌజ్ ప్రాంతాల్లో ఉదయం పది నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.


- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు భూపతిరావు నగర్ 11 కేవీ ఫీడర్ పరిధి శక్తి గణేష్ నగర్, అల్వాల్ హిల్స్, ఎంఈఎస్ కాలనీ, లాఫాం గోదామ్స్, ఆశాజ్యోతి కాలనీ, గోపాల్‌నగర్, కంటోన్మెంట్ పరిధిలోని కంటోన్మెంట్ కార్యాలయం, ఆగ్రా స్వీట్ హౌజ్ లైన్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంటి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

సనత్‌నగర్: ఈఎస్‌ఐ, ప్రకాష్‌నగర్, మైత్రీవనం, ఆల్విన్, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 11 నుంచి 12 గంటల వరకు తాతాచారికాలనీ, పోచమ్మ బస్తీ, ఆర్‌బీఐ క్వార్టర్స్, వాణి ప్రింటర్స్ ఏరియా, మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు ఎరుకల బస్తీ, మెజిస్టిక్ మాన్షన్, జాగృతి అపార్ట్‌మెంట్, ఆర్‌బీఐ లేన్ ఎదురు ప్రాంతాల్లో..
- మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ప్రకాష్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుక ప్రాంతం, చీకోటి గార్డెన్, సనత్‌నగర్ ఫైర్ స్టేషన్, పోలీస్ క్వార్టర్స్, పోలీసు క్వార్టర్స్, 3ఆర్‌టీ, ఫతేబాగ్, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో..
- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్‌గ్రాఫ్, బీకేగూడ, జెక్‌కాలనీ, శివాజీ నగర్, ఎల్‌ఐజీ, ఉదయ్‌నగర్ కాలనీ, హనుమాన్ టెంపుల్ ప్రాంతాల్లో..
- ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సౌభాగ్యనగర్, ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్, కైలాష్‌నగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ముషీరాబాద్: అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లను అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ముషీరాబాద్ కాంగ్రెస్ నాయకుడు గుర్రం శంకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌లో ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలను అన్ని విధాల సంక్షేమ పథకాలు ఇవ్వకుండా దూరం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సర కాలంలోనే ఇచ్చిన హామీలన్నిటిని అమలు చేస్తోందని తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు,ఇందిరమ్మ ఇళ్లు పేదలకు అందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, అనిల్‌కుమార్‌యాదవ్, గుర్రం దినేష్, జాన్ శ్రీనివాస్, రాజు, శేఖర్, సత్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...)టమాటా.13, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 11, క్యారెట్ 19, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 40, గోకరకాయ 28, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 27, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 10-12, ముల్లంగి 4-5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వర్గీకరణ ద్వారానే అభివృద్ధి సాధ్యం



బోలక్‌పూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్: ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగలు, మాదిగ ఉపకులాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని సనత్‌నగర్ మాదిగ హక్కుల, అభివృద్ధి జేఏసీ నాయకులు ఏసూరి మహేష్ అన్నారు. ఫిబ్రవరి 7న జరిగే వేయి గొంతులు...లక్షడప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బోలక్‌పూర్, ఐడీహెచ్ కాలనీ, గొల్లకొమురయ్య కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలు విషయంలో తన మాట నిలుపుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బొర్ర భిక్షపతి మాదిగ, టీవీ నర్సింహ్మారావు, డప్పు మల్లికార్జున్ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతిపత్రం



రసూల్‌పురా: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 420 హామీలు, 6 గ్యారంటీలు, పలు డిక్లరేషన్లు వెంటనే అమలు చేసేలా వారికి మంచి బుద్ధి ప్రసాదించాలని బీఆర్‌ఎస్ నాయకులు మహాత్మగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ తిరుమలగిరి వంగపల్లి గార్డెన్‌లోని గురువారం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహానికి వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యులు నరసింహ ముదిరాజ్, రావుల సతీష్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో సమస్యలు పరిష్కరించాలి

అడ్డగుట్ట: శేషాపహాడ్‌లోని సత్యహరిశ్చంద్ర హిందూ శ్మశాన వాటికలో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరికి నర్సింగ రావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ దహన సంస్కారాల కోసం వెళితే అక్కడి కమిటీ వారు ఇష్టానుసారంగా వేలల్లో డబ్బు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కనీస వసతులు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. శ్మశానవాటికలో ఎక్కడ చూసినా చెత్త చెదారం పేరుకుపోయిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్: పంజగుట్ట దుర్గానగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ద్వాత్రింశత్ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 3వ తేదీ వరకు అయిదు రోజులపాటు ఈ బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు తెలిపారు. పూజల్లో భాగంగా గురువారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, స్వామివారికి పంచామృత స్నపనం, ధ్వజపట ప్రతిష్టా, పూజాదికాలు నిర్వహించారు.

కార్పొరేటర్ల అరెస్టు అప్రజాస్వామికం

ఎమ్మెల్యే తలసాని

రాంగోపాల్‌పేట్: బడ్జెట్ సమావేశాల్లో ప్రశ్నించిన కార్పొరేటర్లను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గురువారం జీహెచ్ఎంసీ వద్ద బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను అరెస్టు చేసి రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌లో అరెస్టై నిరసన తెలుపుతున్న కార్పొరేటర్లను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి తలసాని పరామర్శించారు. జీహెచ్ఎంసీ బడ్జెట్ సమావేశాల్లో ఎలాంటి చర్చ లేకుండానే బడ్జెట్ ఆమోదించడం సరికాదన్నారు. గత ఏడాది కేటాయించిన బడ్జెట్‌లో ఎంత ఖర్చు చేశారో చర్చించాలని ప్రశ్నించినందుకే మార్షల్స్‌తో బయటకు తోసేశారని విమర్శిచారు. మేయర్ కార్పొరేటర్ల పట్ల దురుసుగా మాట్లాడారని, బెదిరించే ప్రయత్నం చేశారని కార్పొటర్లు తమ దృష్టికి తెచ్చినట్లు తలసాని తెలిపారు.



పోలీస్ స్టేషన్‌లో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు తలసాని, కాలేరు

మహాత్మాగాంధీకి నివాళులర్పించిన తలసాని



రాంగోపాల్‌పేట్: గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఎంజీరోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. సత్యం అహింసను ఆయుధంగా చేసికుని దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన గొప్ప మహనీయులు గాంధీ అని ఆయన కొనియాడారు. సహాయ నిరాకరణతో ప్రజలను ఉద్యమం వైపు నడిపించి బ్రిటీష్ పాలన నుంచి దేశానికి విముక్తిని కల్పించారని స్మరించుకున్నారు. ఆయనతో పాటు మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, అరుణగౌడ్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కిశోర్‌కుమార్, ఆకుల హరికృష్ణ, ఆంజనేయులు, విజయ్‌చారి, సతీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

2న టెన్త్ విద్యార్థులకు మోడల్ పరీక్ష

పద్మారావునగర్: వివిధ పాఠశాలల్లో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 2న మోడల్ గణిత పరీక్ష నిర్వహిస్తున్నట్లు పద్మారావునగర్‌లోని శ్రీ సాయి విజ్ఞాన భారతి జూనియర్, డిగ్రీ కళాశాల (మహిళలు) యజమాన్యం ప్రకటించింది. పద్మారావునగర్‌లోని కళాశాలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 040-42620754 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి అల్లూరి విజయ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఓయూలో మాట్లాడుతూ దేశంలో విద్యను బలోపేతం చేసేందుకు కేంద్రం ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నూతన విద్య విధానంతో ప్రభుత్వ విద్య నిర్వీర్యం మవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వర్సిటీలపై యూజీసీ కర్రపెత్తనం కాకుండా అధిక నిధులు, నియామకలు చేపట్టాలన్నారు. అధిక నిధులతో నాణ్యమైన విద్యను అందిస్తూ నూతన పరిశ్రమల స్థాపనంతో నిరుద్యోగ సమస్యను అధిగమించవచ్చు అన్నారు.

హనుమాన్ ఆలయ హుండీ ఆదాయం రూ.10 లక్షలు

సనత్‌నగర్: హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్)లో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలోని 20 హుండీలకు సంబంధించి 132 రోజులకు గాను రూ.10,05,617 ఆదాయం సమకూరినట్లు ఈఓ సత్యనారాయణ తెలిపారు. పర్యవేక్షణాధికి వై.అన్నారావు పర్యవేక్షణలో కొనసాగిన ఈ కార్యక్రమంలో అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులు, సుదర్శనాచార్యులు, రిపుంజయశర్మ, గోపాల్‌జోష, వెంకటేష్‌లతో పాటు సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న దృశ్యం..

నేడు యూఎస్ఏ స్టడీ ఎక్స్‌పో

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో నేడు అమెరికాలోని పలు యూనివర్సిటీల ద్వారా విద్యార్థులకు అందే విద్య, ఉపాధి అవకాశాలపై స్టడీ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ ట్రీ సంస్థ ఫౌండర్ ఆలపాటి శుభకర్ తెలిపారు. ఈ ఎక్స్‌పోలో అమెరికాలో ప్రఖ్యాతిగాంచిన యూనివర్సిటీ ప్రతినిధులతోపాటు ఇమ్మిగ్రేషన్, వీసాకు సంబంధించిన పలు కీలక విషయాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలుసుకునే అవకాశం ఉంటుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. యూఎస్ కాన్సులేట్ అధికారులతో ఎడ్యుకేషన్, వీసా పాలసీలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఘనంగా సేవాసంఘ్ ఆవిర్భావ దినోత్సవం

వెంకటేశ్వరకాలనీ: ఆలిండియా బంజారా సేవా సంఘ్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్ గ్రౌండ్‌లో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ హాజరై సేవా సంఘ్ జెండాను ఎగురవేయడంతోపాటు సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సేవా సంఘ్ ద్వారా నేతలు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం సేవాలాల్ మహరాజ్ సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

సకాలంలో మందులు వాడితే కుష్టువ్యాధిని నివారించొచ్చు

ముషీరాబాద్: కుష్టువ్యాధి నివారణకు సకాలంలో మందులు వాడితే నియంత్రించవచ్చని భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం కుష్టు నివారణపై పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కుష్టు ఓ బ్యాక్టీరియా వల్ల వస్తుందన్నారు. చర్మంపై మార్పులు సంభవిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 13వ తేదీ వరకు వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తామని తెలిపారు.

